నిస్వార్థ నాయకుడు మాజీ ప్రధాని వాజ్‌పేయి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సనత్‌నగర్: అంకితభావం, నిస్వార్థ రాజకీయానికి నిలువెత్తు నిదర్శనంగా మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి మార్గదర్శకుడిగా నిలిచారని పలువురు నేతలు కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా సనత్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో నెహ్రూ పార్కు వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నేతలు హాజరై వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా హుందాగా నడుచుకుంటూ స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దయానంద్, మూల రవీందర్, లింగంపల్లి నర్సింగరావు, లక్ష్మీనారాయణ, నక్క శ్రీనివాస్‌గౌడ్, సిర్మనీ నరేశ్, వారణాసి, మాధవి, రాంప్రసాద్, రవిశంకర్, సునీల్ పాల్గొన్నారు.

బీజేపీ నేత రామ్మోహన్ ఆధ్వర్యంలో..

సనత్‌నగర్: బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మోహన్, వెంకట సుబ్బారావు, చైతన్య పాల్గొన్నారు.

ప్రతిభకు పదును పెడుతూనే ఉండాలి

సనత్‌నగర్: విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెడుతూ ఉంటేనే ఉన్నతంగా రాణించగలుగుతారని వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌గౌడ్ అన్నారు. వివిధ క్రీడ, సాంస్కృతిక అంశాలతో పాటు చదువులో రాణించిన హిందూ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు శుక్రవారం అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధులు హెచ్‌ఎన్ త్రిపాఠి, ప్రిన్సిపాల్ రాధిక పాల్గొన్నారు.

బీజేపీ నేతల కొవ్వొత్తుల ప్రదర్శన

సనత్‌నగర్: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ బీజేపీ నాయకులు శుక్రవారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలి ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల జీవితాల్లో వెలుగు

ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ

పద్మారావునగర్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ, ఉపకులాల జీవితాల్లో వెలుగు చూడగలమని ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ అన్నారు. కె.రాజు ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం శుక్రవారం ఆయనను కలిసి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ వర్గీకరణ లక్ష్యసాధనకు సుమారు మూడు దశాబ్దాలుగా రాజీలేని పోరాటం చేసిందన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగంగా ఎమ్మార్పీఎస్ అర్థవంతమైన పోరాటాలు, ఉద్యమాల వల్ల ప్రజలు, రాజకీయ పక్షాల మద్దతు కూడ గట్టిందన్నారు. ఏండ్ల తరబడి నుంచి మాదిగలు, ఉపకులాలు విద్యా, ఉద్యోగ అవకాశాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంజీవపురం హరిజన సేవా సంఘం కమిటీ నాయకులు జి. శ్రీహరి, మల్లేశ్, సత్యనారాయణ, వెంకటేశ్, రాజు, లక్ష్మణరావు, సుదర్శన్, శివ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షిక పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న వేదపండితులు

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మేళతాళాలు, భాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 17వ తేదీ శనివారం ఉదయం 9.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో కలశాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావు, ఈఓ రాజేశ్‌కుమార్ తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుపై వెలిసిన ఫ్లెక్సీలు

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి అభిమానుల పేరిట ఏర్పాటు

రసూల్‌పురా: నగరంలోని పలుచోట్ల మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుపై మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అభిమానుల పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు శుక్రవారం ఉదయం కలకలం రేపాయి. 'దమ్ముంటే రాజీనామా చేయ్..రుణమాఫీ అయిపోయే..నీ రాజీనామా ఏడబోయే..అగ్గిపెట్ట హరీశ్ రావు' అంటూ కొంపల్లి, సికింద్రాబాద్, ప్యారడైజ్, ప్యాట్నీ, రసూల్‌పురా చౌరస్తా, బేగంపేట ప్రకాశ్‌నగర్, పంజాగుట్ట సహా పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఓ పక్క హరీశ్‌రావు మాజీ సీఎం కేసీఆర్ ఫొటోలు. మరోపక్క సీఎం రేవంత్ రెడ్డి తలపాగా చుట్టుకుని ఉన్న ఫొటోతో పాటు 2 లక్షల రుణమాఫీ..అన్నదాతల రుణ విముక్తి పండగ.. రైతన్నల ముఖాల్లో చిరునవ్వుల పండగ.. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేవంతన్న సర్కారు అంటూ ఏర్పాటు చేశారు. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు స్పందించి హరీశ్‌రావుకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని వెంటనే తొలగించాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాలతో ఉదయం 10 గంటల వరకు సిబ్బంది వాటిని తొలగించారు.



ఎస్పీరోడ్‌లోని ఆనంద్ థియేటర్ బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



ప్యారడైజ్ బస్టాప్ వద్ద ..

అక్రమంగా కొనసాగుతున్న

రిటైర్డ్ ఉద్యోగులను తొలగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో అక్రమంగా కొనసాగుతున్న 1050 రిటైర్డ్ ఉద్యోగులను వెంటనే తొలగించాలని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎం శ్రీకాంత్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఓయూలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సేవలకు పింఛన్ కాకుండా ప్రతి నెల వేతనాలు, ఇతర అలవెన్సులు కలిపి దాదాపు రూ.150 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. దీనివలన కొత్త ఉద్యోగాలకు రాకుండా నిరుద్యోగులకు, ప్రమోషన్లు దక్కకుండా అర్హత గల సీనియర్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే రిటైర్డ్ ఉద్యోగులను తొలగిస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా తొలగించాలని లేకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్‌ఏ నాయకులు రాంకిషన్, మురళీకృష్ణ, రంజిత్ వర్మ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వంజరి సంఘం రాష్ట్రస్థాయి సమావేశం



విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

లాలాపేట: తార్నాకలోని వంజరి భవన్‌లో ఆ సంఘం రాష్ట్రస్థాయి సమావే శాన్ని శుక్ర వారం నిర్వహించారు. హై దరాబాద్‌తో పాటు తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరయ్యా రు. స్వా తంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించు కు ని వంజరి సామాజిక వర్గంలో ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించారు. అలాగే 150 మందికి రూ 10 వేల చొప్పున ఆర్థిక సాయం, నోటు బుక్కులు అందజేశారు. తెలంగాణ వంజరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాలేరు నరేందర్, ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం, కోశాధికారి కాలేరు అమరేందర్, ముఖ్య సలహాదారు సాల్వేరు ముత్తయ్య, కాలేరు సురేందర్, కాలేరు విశ్వనాథం, ప్రవీణ్, విజయ్‌కుమార్, సత్యం, రాజు ఉన్నారు.

మహంకాళి అమ్మవారికి

గాజులతో అలంకరణ



అమ్మవారిని గాజులతో అలంకరించిన దృశ్యం

రాంగోపాల్‌పేట్: శ్రావణ శుక్రవారం కావడంతో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని గాజులతో అలంకరించారు. దీంతోపాటు ఆలయాన్ని రంగురంగుల గాజులతో ముస్తాబు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆలయంలో జరిగిన వరలక్ష్మీ వ్రతాల్లోనూ మహిళలు పాల్గొన్నారు. దేవాలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు.

అమ్మవారికి రెండోవారం సాక..

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మావారికి ఆలయం తరఫున రెండో వారం సాకను సమర్పించారు. గత బోనాల జాతరలో భాగంగా భవిష్యవాణితో తనకు 5 వారాల పాటు సాకను సమర్పించాలని అమ్మవారి చెప్పిన సంగతి తెలిసిందే. దీంతో సాకను సమర్పించారు.



అమ్మవారికి సాకను సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

లాలాపేట: శ్రావణ శుక్రవారం సందర్భంగా తార్నాక డివిజన్ వ్యాప్తంగా వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తార్నాక, లాలాపేటలోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఇండ్లలో వ్రతాలు చేసుకున్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సుక్క గణేశ్‌రావు నివాసంలో వ్రతాన్ని నిర్వహించారు. సంతోషి మాతా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు తిరుమల రేణుక, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

7వ వేతన సవరణను అమలు చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులకు ఏడో వేతన సవరణను అమలు చేయాలని యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్టు)–టీజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరశురాం శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పీఆర్‌సీ అమలుతో పాటు కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అదే విధంగా వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల రిటైర్మెంట్ వయస్సును రద్దు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాంకు శుభాకాంక్షలు

లాలాపేట: ప్రొఫెసర్ కోదండరాం శుక్రవారం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయడంతో తెలంగాణ గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అశోక్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సారథి ప్రొ. కోదండరాంకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మధుయాదవ్, గజ్జి రమేశ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

వచ్చే నెలలో వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్

ఉస్మానియా యూనివర్సిటీ: వచ్చే నెల 14, 15 తేదీల్లో వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ గోపాల్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్‌ను ఆహ్వానించినట్లు ఆయన పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో జరిగే కార్యక్రమానికి ఇతరులు కూడా హాజరుకావచ్చని తెలిపారు. డా.విద్యాసాగర్, డా.దరువు ఎల్లన్న, రాఘవేంద్రరెడ్డి ఉన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నిక

బౌద్ధనగర్: పార్శిగుట్టలోని న్యూ అశోక్‌నగర్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడిగా ఓం ప్రకాశ్ ముదిరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బౌద్ధనగర్‌లోని అర్బన్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో శుక్రవారం కమిటీ సమావేశం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ స్వరూప, మల్లేశ్, పర్వతాలు, బాబి, డప్పు మల్లికార్జున్, వేణు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 18న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఆయ న కృతజ్ఞతలు తెలిపారు.

యువకుడి అరెస్టు

అడ్డగుట్ట: ప్రేమ పేరుతో ఓ మైనర్ బాలికను మోసం చేసిన యువకుడిపై తుకారంగేట్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పీ శ్యాంసుందర్ (20) స్థానికంగా ఉండే ఓ బాలిక (16)తో పరిచయం పెంచుకున్నాడు. ఏడాదిగా ఆ బాలికను ప్రేమిస్తున్నాడు. ఈ నెల 14వ తేదీన ఆ బాలికను మెదక్ తీసుకెళ్లాడు. దీంతో బాలిక కనిపించకపోయే సరికి తల్లిదండ్రులు తుకాంగేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు మెదక్‌లో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేసి తీసుకు వచ్చారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

సనత్‌నగర్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ వరలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం .. బేగంపేట రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ ప్రార్థ నాలయం ఎదుట 40–45 ఏళ్ల వయస్సు గల మహిళ అపస్మారక స్థితిలో పడి ఉంది. గమనించిన రైల్వేస్టేషన్ పార్కింగ్ సూపర్‌వైజర్ అశోక్ వెంటనే డయల్ 100 కు సమాచారం ఇచ్చారు. బేగంపేట పోలీసులు 108 అంబులెన్స్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందింది. పగటిపూట లోకల్ రైళ్లలో సంచరిస్తూ భిక్షాటన చేస్తుంటుందని, పార్కింగ్ స్థలంలో నిద్రిస్తుంటుందని స్థానికులు తెలిపారు. చుట్టుపక్కల వారిని విచారించగా సోనాక్షి అలియాస్ బుచ్చి అని పేరు మాత్రమే తెలుసని, ఇతర వివరాలు తెలియవని చెప్పారు.